# ఆఫీసరుగారి ప్రయాణం

మా వూరికి, మా వూరు రైల్వేస్టేషనుకు మైలున్నర దూరముంది. మెటల్ రోడ్డు కిరువైపులా చింతా, మర్రి, నేరేడు చెట్లున్నాయి. ఆ చెట్ల నీడన నిండు వేసవికాలంలో కూడా హాయిగా నడిచి వెళ్ళవచ్చు. మా వూరు స్టేషనులో ఎక్కే, దిగే ప్రయాణీకులలో నూటికి తొంభైమంది నడిచే ఊళ్లోనుంచి రావడం గాని, ఊళ్లోకిపోవడంగాని జరుగుతూ వుంటుంది. ఎందు చేతంటే, వాహనవసతి తగినంతగా లేదు. మూడే ఒంటెద్దు బళ్ళున్నాయి. రిక్షాలు లేవు. మగవాళ్ళు ఎక్కడానికి నామూషిపడతారు. ఆడవాళ్ళుకూడా అందరూ ఎక్కరు. కిరాయి రూపాయిపావలా, రూపాయిన్నరా వుంటుంది.

ఓ రోజు మా వూరు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారు, ఆయన సంసారం పెళ్ళికి వెళ్ళడానికి రైల్వే ప్రయాణం చేయవలసి వొచ్చింది. విజయవాడకు వెళ్ళే ప్యాసింజరు ఎనిమిదిన్నర గంటలకు వస్తుంది. ఆ ట్రయినులో వెళ్లవల్సివుంది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారు ఉదయం ఏడుగంటలకే ప్యూన్‌నుపిల్చి ఓ మంచి ఒంటెద్దుబండి స్టేషనుకు వెళ్లడానికి మాట్లాడమని చెప్పారు.

ఆ ప్యూను ఆరున్నర గంటలకు వచ్చి, చేతులు కట్టుకొని నిలబడి సవినయంగా మనవి చేశాడు. "అయ్యా! ఊళ్లో ఒంటెద్దుబళ్ళు దొరకలేదండీ!"

వాత రోగిష్ఠియైన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారికి ఒంటిపై కారపునీళ్లు చల్లినట్టయింది. చిందులు త్రొక్కాడు.

"వెధవా! ఊళ్ళో మనకు కావాలంటే బళ్లు దొరక్క పోవడమేమిటి?" అన్నాడు గ్రామానికి కిరీటం లేని చక్రవర్తి లాగ.

"ఊళ్లో మహాదేమూడు ఒంటెద్దుబళ్లున్నాయండీ! అందులో ఒకబండి ప్రెసిడెంటుగారి ఇంట్లో ఆడవాళ్లు ఊరెళ్ళుతూంటె బాడుగకు ఒప్పుకోబడింది. రెండో బండి మున్సబుగారికి నిన్న మాపిటాలే రిజర్వు చేయబడిందంటండీ! మూడో బండి వెంకటస్వామిది. ఇవ్వాళ ఆ బండిని కట్టనన్నాడండి వెంకటస్వామి".

"ఏం?"

"ఎద్దుకు గాలికుంటు రోగం వచ్చిందటండీ నడవలేదట!"

"అఘోరించినట్టే వుంది. ఇప్పుడేమిటి చేయడం! ఆడవాళ్ళు నడిచి స్టేషను కెలా వెడతారు! బండి టైం కూడా కావస్తుంది" అన్నాడు ఆఫీసరుగారు ఆదుర్దాగా.

ఆయన ప్రక్కనున్న జిల్లా కలెక్టరు ఓ చిన్న ఉపాయం చెప్పాడు.

"సార్ ! వెంకటస్వామి దగ్గర్నుంచి బండి తీసికుంటే, ఎద్దు మన దగ్గరున్నదిగా! పని గడుపుకోవచ్చు.

"మన దగ్గర ఎద్దు ఎక్కడిదోయ్ !"

"ఎందుకులేదుసార్ ! రోజుకు మూనెడు దానా, మోపు పచ్చిగడ్డి, ఎండుగడ్డి, జనపకట్టలు తింటూ అంబోతులా బల్సిన మన పంచాయతీ వంకెద్దుబండి ఎద్దు వున్నదిగా సార్ ! రోజూ బజార్లలోని చెత్తాచెదారాన్ని ఆ బండితో నేగా తోలించేది."

"ఔనుమేనోయ్ ! సరే, వెంటనే ఆ ఎద్దును తోలుకెళ్ళి, వెంకటస్వామి బండికి కట్టించుకొనిరండి" అన్నాడు ఆఫీసరు గారు ఆవేశం తగ్గని ఆదుర్దాతో.

ఇద్దరు ప్యూన్లు పరుగులు తీశారు.

అరగంటలో ఎద్దునూ, బండిని సిద్ధం చేయించి ఇంటి వాకిటముందు నిలబెట్టారు. ఆఫీసరుగారు సంతోషించారు. ఆయన ఆదుర్దా జారిపోయింది.

అమ్మగారు స్నానంచేసి, పిల్లలకు స్నానాలుచేయించి, వాళ్ళకు కొత్త దుస్తులు తొడిగి తను పట్టుచీరా, పట్టు జాకెటూ ధరించి, నగలు పెట్టుకొని మొహానికి టాయిలెట్ ముగించేసరికి ఏడూ-నలభై అయింది. ఈ లోపలే ఆఫీసరుగారు దుస్తులు మార్చుకొని రెడీగా ఉన్నారు.

వ్యాసులు పెట్టెల్ని బండిలో సర్దారు. పిల్లల్ని బండిలో ఎక్కించారు. అమ్మగారు, అయ్యగారు బండి ఎక్కేసరికి అయిదు నిమిషాలు తక్కువగా ఎనిమిదైంది.

ఆఫీసరుగారు చేతిగడియారం చూస్తూ, "అరగంటలో స్టేషన్‌కు వెళతామా?" అన్నాడు సందేహాన్ని వ్యక్తపరుస్తూ.

బండి ఎక్కిన వ్యాసు, "సార్! పావుగంటలో వెళతామండీ! ఎద్దు మంచి బలంమీదున్నది పరుగులు పెట్టిస్తాను" అన్నాడు.

"జాగ్రత్తరోయ్!" అంటూ చిరునవ్వు నవ్వుకున్నారు ఆఫీసరుగారు.

ఒంటెద్దుబండి సాగారింది. గొందిదాటి మెయిన్ బజారుకు వచ్చింది. పదిగజాలు దాటేసరికి ఎద్దు తక్కున ఆగింది. బండిలోంచే వ్యాసు అదిలించినా కదల్లేదు. అక్కడ వేపచెట్టు క్రింద కూర్చున్న ముగ్గురు రైతులు ఎగాదిగా చూశారు.

"బండెందుకు ఆగిందిరోయ్!" వెనక బాక్సుపెట్టుకొని కూర్చున్న ఆఫీసరుగారు కేకవేశారు.

వ్యాసు బండిదిగి ఎద్దును అదిలించసాగాడు. అక్కడ రోడ్డు ప్రక్క శాస్త్రమండీవుంది.

రెండు నిమిషాల తర్వాత ఆ ఎద్దు మామూలుగా కదిలింది.

మళ్ళీ వందగజాల తర్వాత కళ్ళీబడ్డి దగ్గర ఆగింది, ఎంత కొట్టినా ఎద్దు అడుగు ముందుకు వేయ్యలేదు. గొడ్డ-డొక చెక్కి కుంటి ఉన్నది. వ్యాను బండి దిగాడు.

కళ్ళీబడ్డీ దగ్గర చేరిన నలుగురు మనుష్యులూ బిగ్గరగా నవ్వారు.

"ఆఫీసరుగారు భలే ఒంటెద్దు బండిలో ప్రయాణం చేస్తున్నారు."

"కిరాయికోసం కక్కుర్తిపడి వుంటారు"

ఆ వ్యాఖ్యానాలను విన్న ఆఫీసరుగారి మొహం అవజ్ఞా ఖారంతో పెనంమీద మాడిన అట్టులాగైంది.

ఆ విధంగా పూరుదాటేవరకు ఎద్దు ప్రతిచిత్త కుంటేవద్ద ఆగుతూ, మారాము చేస్తూపోయింది. ఆఫీసరుగారు బండి దిగి నడువలేక, బండిలో కూర్చోలేకా ఆదరత్తైరలో ఖోళ పగిటి గిలగిల కొట్టుకున్నారు.

కాని ఆ ఒంటెద్దుబండి స్టేషనుకు యాభై గజాల దూరంలో వుండగానే విజయువాడకు వెళ్లే ప్యాసింజర్ ట్రైన్ రావడమూ, పోవడమూ అయింది.

ఆఫీసరుగారు బండిదిగి, ఉగ్రభైరవ మూర్తియై, "వెధవ ఎద్దు" బండులదొడ్డికి తోలండి. రేపట్నుంచీ దీనికి దానా, పచ్చిగడ్డి, ఎండుగడ్డి, జనపకట్టె ఏమీ వేయకుండా నెలరోజులు పాటు మాడ్చండి" అన్నాడు.

— ❦ —